4 | నమస్తే తెలంగాణ
హైదరాబాద్
సోమవారం 22 ఏప్రిల్ 2024
www.ntnews.com

# చె లి మె

తెలంగాణ ప్రజలకు భాష ఓ పిలుపు మాత్రమే కాదు. చరిత్ర మారినా చెదరని అస్తిత్వం. అందుకే తెలంగాణ ఘన సాహిత్యానికి పెద్దపీట వేస్తూ చెలిమెను నిర్వహిస్తున్నది మన పత్రిక. అలసిసొలసిన వేళల్లో కళారూపాలైనా, పోరుబాటల్లో పాటలా మారినా, ఆత్మగౌరవాన్ని కథతో నినదించినా... తనదైన శైలి తెలంగాణది. ఆ సాహిత్యంలో మీకు ఎలాంటి అభిరుచి ఉన్నా, కలాన్ని కదిలించండి. ఆసక్తిగా, సూటిగా తెలంగాణ సాహిత్యానికి సంబంధించిన రచనలు చేయండి... editpage@ntnews.com

# మేఘ సందేశం అనువాదాల పరంపర

**కవి అనే మాటకు పర్యాయపదంగా నిలిచినవాడు కాళిదాసు. కవికుల గురువుగా, కవి యువరాజుగా పిలువబడే కాళిదాసు మరువలేని అత్యద్భుత కవిత్వాన్నీ, నాటకాలనూ సృష్టించడమే ఇందుకు కారణం. కవి కాళిదాసు గొప్పదనం గురించి ఒక శ్లోకం చాలా ప్రచారంలో ఉన్నది. 'పురా కవీనాం గణనా ప్రసంగే / కనిష్ఠికాధిష్ఠిత కాళిదాసా / అద్యాపి తత్తుల్య కవే రభావా/ దనామికా సార్థవతీ బభూవ' అంటే పూర్వం పండితులు ఉత్తమ కవులెవరని లెక్కిస్తూ కాళిదాసు పేరు చెప్పి చిటికెనవేలు (కనిష్ఠిక)ను మడిచి తరువాతి ఉంగరం వేలును మడవబోగా కాలిదాసుకు సమానుడైన కవి ఎవరూ లేకపోవడంతో ఆగిపోయారట. అందుకే ఉంగరం వేలు అనామకంగా 'అనామిక'గా సార్థకమైంది అని అర్థం.**


ఇక ఒక రసిక శిఖామణి 'కాళిదాస కవితా నవం వయః/ మాహిషం దధి సశర్కరం పయః/ వెణమాంస మబలా చ కోమలీ/ సంభవంతు మమ జన్మజన్మని' అంటూ తనకు ప్రతి జన్మలో కాళిదాసు కవిత్వం నవ యౌవనం, గేదె పెరుగు, చక్కెర కలిపిన పాలు లేడిమాంసం, కోమలమైన స్త్రీ దొరకాలనీ కోరుకున్నాడు. కాళిదాసు అంటే కాళికామాత భక్తుడు, సేవకుడు అనీ అర్థం. ఏమీ తెలియని, చదువురాని పామర యువకుడు కాళికామాత అనుగ్రహంతో గొప్ప విద్వాంసుడై మహాకవి అయినాడని, అందుకే కాళిదాసుగా పేరు వచ్చిందని ఒక ఐతిహ్యం.

కాళిదాసు రచనలు: సంస్కృతంలో పంచ మహా కావ్యాలుగా ప్రసిద్ధి పొందిన 'రఘు వంశమ్', 'కుమార సంభవమ్' కావ్యాలను కాళిదాసు రచించాడు. 'మాళవికాగ్ని మిత్రం', 'విక్రమోర్వశీయం', 'అభిజ్ఞాన శాకుంతలమ్' అనే మూడు నాటకాలనూ రాశాడు. ఈ 'అభిజ్ఞాన శాకుంతలమ్'తో ప్రపంచం చేత ప్రశంసింపబడి, ముప్పై ఏడు నాటకాలు రాసిన విలియం షేక్స్‌పియర్‌తో పోల్చబడి పాశ్చాత్యులతో 'ఇండియన్ షేక్స్‌పియర్' అనిపించుకున్నాడు.

'ఋతు సంహారః', 'మేఘ సందేశం', అనే రెండు ఖండకావ్యాలూ రాశారు. ఇవి కాకుండా 'శృంగారతిలకం', 'పుష్ప బాణ విలాసం', 'రాక్షస కావ్యం' అనే మూడు ముక్తక కావ్యాలూ కాళిదాసు కృతులుగా చెప్పబడుతున్నాయి. అద్భుత సందేశ కావ్యం 'మేఘ సందేశమ్': మహాకవి కాళిదాసు రచించిన, ఇప్పటికి వన్నె తరగని సందేశకావ్యం 'మేఘ సందేశమ్'. ఇది ప్రపంచ సాహిత్యంలోనే సర్వోత్కృష్ట రచన అని చెప్పబడుతోంది.

భార్యాభర్తల ప్రేమ విరహగాథ 'మేఘ సందేశం'లోని కథ. యక్షులకు రాజైన కుబేరుడి దగ్గర ఒక యక్షుడు ఉద్యోగం చేస్తుంటాడు. శివపూజా తత్పరుడైన కుబేరుడికి- మానస సరోవరంలోని స్వర్ణ కమలాలను రక్షిస్తూ, ప్రతిదినం పూజ కోసం ఆ కమలాలను రాజు కుబేరుడికి అందించడం అతడి విధి. ఒకరోజు ఆ యక్షుడు తన భార్యతో ఒక ప్రొద్దు కాలం గడుపుతూ తన ఉద్యోగ విధిని మరిచిపోతాడు. అందుకు కుబేరుడు కోపించి ఒక సంవత్సరం పాటు ఇల్లాలికీ, ఇంటికీ దూరంగా ఉండాలని శిక్ష వేస్తాడు. ఆ శాపానుసారంగా ఆ యక్షుడు అలకాపురికి దూరంగా రామగిరి (చిత్రకూట పర్వతం) ప్రాంతాల్లో ప్రవాసాన ఉంటూ ఎనిమిది నెలలు భార్యా విరహంతో భారంగా గడుపుతూ, ఆషాడమాసంలో కనిపించిన మేఘంతో తన క్షేమ సమాచారాన్ని సందేశంగా తన భార్యకు విన్పించమని కోరుతూ అలకాపురి వెళ్లే దారినీ, అలకాపురి వైభవాన్ని వివరించి చెప్తాడు. మేఘుడు వెళ్లి ఆ సందేశాన్ని యక్షుడి భార్యకు దేవభాషలో విన్పిస్తాడు. యక్షరాజైన కుబేరుడు అది విని యక్షుడి శాపకాలాన్ని తగ్గించి యక్షుడినీ, యక్షుడి భార్యనూ కలపడంతో కథ ముగుస్తుంది.

'మేఘ సందేశమ్'లో రెండు సర్గలున్నాయి. ప్రథమ సర్గ అయిన పూర్వ మేఘంలో అరవై ఏడు శ్లోకాలు, రెండవ సర్గ ఉత్తర మేఘంలో యాభై ఏడు శ్లోకాలున్నాయి. మొత్తం 124 శ్లోకాలు. ఈ ఖండ కావ్యం మొత్తం మందాక్రాంత వృత్తాల్లో రచింపబడింది.



**'మేఘ సందేశమ్'లో రెండు సర్గలున్నాయి. ప్రథమ సర్గ అయిన పూర్వ మేఘంలో అరవై ఏడు శ్లోకాలు, రెండవ సర్గ ఉత్తర మేఘంలో యాభై ఏడు శ్లోకాలున్నాయి. మొత్తం 124 శ్లోకాలు. ఈ ఖండకావ్యం మొత్తం మందాక్రాంత వృత్తాల్లో రచింపబడింది.**

కశ్చిత్కాంతా విరహగురుణా స్వాధికారాత్ప్రమత్తం / శాపేనాస్తంగమితమహిమం వర్షభోగ్యేన భర్తుః / యక్ష శ్చక్రే జనక తనయా స్నానపుణ్యోదకేషు / స్నిగ్ధచ్ఛాయా తరుషు వసతిం రామగిర్యాశ్రమేషు. (అలయక్షుడొకడు పరాకున / భృత్యవిధిని మరిచిన ఫలితంగా / యక్ష రాజు చేత ఏడాదిపాటు భార్యా విరహభార శిక్షానుభవ్యశప్తుడై / సీతాస్నాత పునీత జలాలనూ, చిక్కటి నీడల చెట్లనూ కలిగివున్న / రామగిరి మలనివాసాలందున / తన ప్రవాస నివాసాన్ని ఏర్పరచుకున్నాడు! అంటూ ప్రారంభమవుతుంది మేఘసందేశమ్ ఖండ కావ్యం. (ఇది నా స్వేచ్ఛానువాదం).

శ్రుత్వా వార్తాం జలదకథితాం తాం ధనేశోపి సద్యః/ శాప స్యాన్తం సదయ హృదయః సన్ని ధాయాస్తకోపః/ సంయోజ్యైతౌ విగళిత శుచౌ దంపతీ హృష్ట చిత్తౌ/ భోగా నిష్టా నభిమత సుఖాన్ప్రాపయామాస భూయః' – (మేఘుడు వినిపించిన ఆ యక్ష విరహ సందేశాన్ని/ ఆలకించిన యక్షరాజైన ధనేశ కుబేరుడు కోపాన్ని వదిలి దయాహృదయుడై వెనువెంటనే తన / భృత్యయక్షుడి శాపాంత వ్యవధిని తగ్గించి/ వియోగశోక విముక్తులైన ఆ యక్షదపంతులను తిరిగి చక్కగా ఒక్కటిగా చేసి/ మళ్లీ వాళ్ళు తమ ఇష్టంగా కోరుకున్న సుఖభోగాల ప్రాప్తిని ప్రసాదించినాడు!!) అనే శ్లోకంతో సుఖాంతంగా ముగుస్తుంది. పరుష పదాల కూర్పు లేకుండా, కఠిన పదాలు లేకుండా, దీర్ఘ సమాసభూయిష్టంగా ఉండకుండా, సరళంగా, లలితంగా ఉండే వైదర్భీరీతిలో సాగుతుంది కాళిదాసు కవిత్వం.

అటువంటి రీతిలో సాగిన ఈ కావ్యానికి నలభై టీకాటిప్పణులు వెలువడటం 'మేఘ సందేశమ్' ప్రఖ్యాతిని తెలియజేస్తుంది.

మానవానుభూతులను నిరంతరం స్పృశిస్తూ, సార్వకాలిక భావనలతో రాసిన కవిత్వం నిత్యనూతనంగా ఉంటుంది. అటువంటి కవిత్వం రాశాడు కాబట్టే కాళిదాసు ప్రపంచ కవులలో ఒకడుగా నిలబడ్డాడు. ఇందుకే 'మేఘ సందేశమ్' భారతీయ భాషల్లోనే కాకుండా ఇంగ్లీష్, జర్మన్, ఫ్రెంచ్, చైనా భాషల్లోకి అనువదించబడింది. విశ్వకవి రవీంద్రుడు, డబ్ల్యూ.బీ. యేట్సు మున్నగువారు ఇంగ్లీషులోకి అనువదించారు.

ఒక చిన్న ఘట్టాన్ని తీసుకొని ఎక్కువ కథ లేకుండా వర్ణనలతో సాగేదే ఖండకావ్యం. ఇప్పటికి 'మేఘ సందేశమ్'ను మించిన సందేశ కావ్యమ్ రాలేదని చెప్పవచ్చు. వాల్మీకీ రామాయణంలోని హనుమత్సందేశం కాళిదాసు 'మేఘ సందేశమ్'కు ప్రధాన ప్రేరణ అని చెప్తారు పండితులు. దీనిని ఆదర్శంగా తీసుకొని 'వాయు సందేశం', 'భృంగ సందేశం', 'కీర సందేశం' మున్నగు కావ్యాలు వచ్చాయి.

తెలుగు అనువాదాలు: క్రీ.శ.1790లో కొటికెలపూడి వెంకటకృష్ణ కవి 'మేఘ సందేశమ్' అనువాదానికి అంకురార్పణ చేశారు. కానీ, ఇది అలభ్యం. వడ్డాది సుబ్బారాయుడి రచన తొలి అనువాదంగా చెప్పవచ్చు. 'మేఘ సందేశమ్'ను 'ద్విపద మేఘదూతం'గా నాలుగు ద్విపద పంక్తు ల్లో ఒక్కొక్క మందాక్రాంత వృత్తాన్ని అనువదించారు.

త్రిపురాన వేంకట సూర్యరాయ ప్రసాదరాయ కవి 'మొయిలు రాయబారం' పేరిట యక్షగానం ఏకాంకికగా రచించారు. రాయప్రోలు సుబ్బారావు 'దూతమత్తేభం' పేరిట యతి ప్రాస రహితంగా అనువదించారు. కలచవీడు శ్రీనివాసాచార్యులు 'విరహి' పేరిట సీసపద్యానువాదం చేశారు. శ్రీ ముకురాల రామారెడ్డి గేయరూపంలో అనువదించారు. ఇట్లా కాళిదాసు 'మేఘసందేశమ్'కు తెలుగులో మహామహులైన కవులెందరో పద్యగేయాల్లో అనువాదం చేసి కాళిదాసు కవిత్వ మహితత్వాన్ని చాటిచెప్పారు.

మహాకవి కాళిదాసు అద్భుతమైన సూక్ష్మమైన పరిశీలననూ, భౌగోళిక పరిజ్ఞానాన్ని ప్రకటించే 'మేఘ సందేశమ్'ను నేనూ తెలుగులో చంద్రుడికో నూలుపోగులా వచనకవితా రూపంలో అనువదించాను.



రఘువర్మ
92900 93933

---



## దోసెడు మట్టి కావాలి

నాకిప్పుడు
మట్టి కావాలి
ఎవరైనా..., దోసెడు మట్టిని
ఇవ్వగలరా?

మనిషిని
మనిషిగా ప్రేమించి
మానవత్వం ఏరులై పారిన
సమానత్వపు అవని మట్టి కావాలి

అధికారపు
ఎత్తుల కోసం
నెత్తురు పారని నేల మట్టి కావాలి

కులాల, మతాల
స్వార్థ రాజకీయాల పార్టీల
పంజరాలు లేని
స్వేచ్ఛ దేశపు నేల మట్టి కావాలి

పేదలు, రాజులు
ధనవంతులు, దౌర్భాగ్యులు
ఒక్కటే తొవ్వలో నడిచిన, ఇలలోని
మట్టి కావాలి

దీనుల, హీనుల కన్నీరును
పన్నీరుగా తాగని, దోపిడి లేని
పుడమి దోసెడు మట్టి కావాలి

జాలి, దయ, ప్రేమ, కరుణల
గాలి వీచే నేల మట్టి కావాలి
చెమట చుక్కల కండ్లల్ల
ఆత్మగౌరవ సిరులు మెరిసే
ధరణి మట్టి కావాలి

బుద్ధుడు కల కన్నట్టి
యుద్ధాలు జరుగని
శాంతిబోధి వృక్షాలు మొలకెత్తిన
నేల మట్టి కావాలి

ఆకలి చితి లేని
అమ్మల రాజ్యపు గని
విలసిల్లిన భూమి మీద మట్టి కావాలి

దుర్మార్గంతో
వికృత చేష్టలు లేని
ప్రకృతిలో భాగమై సాగిన స్వచ్ఛమైన
నేల మట్టి కావాలి

నాకు
దోసెడు మట్టి కావాలి
మహాత్ములెవరైనా సరే తెచ్చి
ఇవ్వగలరా
రోజూ కుంకుమబొట్టుగా
పెట్టుకుంటాను..



చిక్కొండ్ర రవి
95023 78992

---



## పేరు లేని రంగు

అసలీ రంగులెక్కడివి?
ముట్టుకోకుండానే చేతిలో పుట్టి
కంటిని మరకలతో బాధపెడుతూ
ఎదురు తిరుగుతున్నాయి

ఏ పేరుతో పిలిచి
పరిచయం చేసుకొని
మురిసిపోతూ
పులుముకోవాలి ముఖానికి?

మనసుకంటని
ఏ రంగును ఐనా ఎలా ప్రేమించాలి?
ఏమని పొగుడుకొని పొంగిపోతూ
సంతోషపడాలి?

కంటిని ఓ రంగు ఆశపెడితే
మనసుపై మరో రంగు దాడి
మాటకు ముందే మరకవుతుంటే
మాట తర్వాత మచ్చ పడుతుంటే

ఏ రంగు మంచిది?
పేరే లేని రంగు ఒకటుంటే బాగుండు..
మరకపడ్డా బాధనేది ఉండదు.
మెరుపులా కురిసినా పట్టింపుండదు..



చందలూరి
నారాయణరావు
97044 37247

---

దేవుడిచ్చిన గొప్ప వరం బాల్యం. ఎలాంటి అరమరికల్లేకుండా గడిచిపోయే నిష్కల్మశమైన జీవితం బాల్యం. ఇది అమూల్యమైనది, వెలకట్టలేనిది. అందుకే బుడతలు ఏది రాసినా అవన్నీ నిజాలే ఉంటాయి. చిట్టి పొట్టి నడకలతో బడికి వెళ్లి తరగతి గదిలో పాఠాలు వింటూ చదువుతూ, గురువుల సూచనలతో కథలు, గేయాలు చదువుతూ తమ చిట్టి పొట్టి చేతులతో రచనలు చేస్తూ బాల సాహిత్యంలో కదం తొక్కుతున్నారు.

# బుడతలు రాసిన బుజ్జి కథలు

ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాల్లో నీతిని బోధించే మంచి కథలను పెద్దలు చెప్పేవారు. మరిప్పుడు అవి విచ్ఛిన్నమై, ఎవరికి వారుగా ఉంటున్నారు. పిల్లలకు కథలు చెప్పేవారే కరువయ్యారు. వారికి నైతిక, సక్రమ ప్రవర్తనను తెలియజేపే బాధ్యతను నేడు బాల సాహిత్యకారులు తమ భుజాల మీద మోస్తున్నారనటంలో ఎంతమాత్రం సందేహం లేదు. వీరు కథలను రాస్తూ పిల్లల చేత చదివిస్తున్నారు. పిల్లలకు పెద్ద వాళ్లు లేని లోటును తీరుస్తున్నారు. మన రాష్ట్రంలో బాల సాహిత్యానికి విశేష కృషిచేస్తూ బడిపిల్లల రచనలను బాల చెలిమి ప్రచురణలుగా పుస్తకాలుగా ముద్రించడం ఆనందదాయకం. చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ బాల సాహిత్యానికి ఇస్తున్న ప్రోత్సాహం వెన్నుదన్ను వెలకట్టలేనిది. బాల సాహిత్యానికి అకాడమీ ఊపిరులూదుతున్నది. 'సిద్దిపేట బడిపిల్లల కథలు' పుస్తకం సంకలనంగా తీసుకువచ్చి ఆర్థికంగా రచయితలను, చిన్నారులను ప్రోత్సహిస్తున్నది. బడి పిల్లలను బాల రచయితలుగా తీర్చిదిద్దుతున్నది. ఈ పుస్తకంలో మొత్తం 27 కథలున్నాయి. ప్రతి కథలో ఏదో ఒక చక్కటి నీతి, కథకు తగిన చిత్రాలను అందించడం అదనపు బలం.





ఆడపిల్లలను తక్కువ చూడకుండా మగపిల్లలతో సమానంగా పెంచాలనే సందేశంతో 'ఆడపిల్ల ఆప్యాయత' కథను సాయికుమార్ చక్కగా వర్ణించిన విధానం ఆకట్టుకునే విధంగా ఉన్నది. మగ పిల్లలను ఎక్కువ చేస్తూ, ఆడపిల్లలపై వివక్ష చూపే తల్లిదండ్రులకు కనువిప్పు కలిగించే చక్కటి కథ ఇది. మరో కథ 'అత్యాశ'. ఇందులో మనిషికి ఆశ ఉండాలి, కానీ అత్యాశ మరి ప్రమాదకరం. అత్యాశతో ఉండేవారికి జీవితంలో అపాయాలు ఎదురవుతాయనే నీతిని సృజన్‌కుమార్ వివరించాడు.

చిన్నారి శ్రీజ రాసిన 'స్నేహం విలువ' కథ స్నేహానికి డబ్బు, అందం, ఆకారం, కుల మతాలతో సంబంధం లేదు. అందరూ కలసిమెలిసి ఉంటూ ఒకరికొకరు సహాయం చేసుకోవడమే స్నేహం గొప్పతనం అంటూ చక్కగా వివరించిన విధానం బాగుంది. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం వల్ల ఆరోగ్యంగా జీవిస్తాం. ఎలాంటి రోగాలు దరిచేరవు అనే సందేశంతో 'ఆరోగ్యం' అనే కథలో శివలీల చక్కగా వివరించింది. ఈ కథను చదివితే ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలనే ఆలోచన కలుగుతుంది.

తేజశ్రీ రాసిన 'అంగట్లో అన్యాయం' కథలో అపకారికి ఉపకారం చేసేవారే గొప్పవారు. మనకు కీడు చేశారని మనసులో పెట్టుకోకుండా మంచి చేయాలని, చిన్నారి రాసిన ఈ కథ పాఠకులను ఆలోచింపజేస్తుంది. అందరూ కలసి ఉంటేనే సుఖం ఉంటుంది. ఎవరికి వారుగా ఉంటే కష్టాలే అని 'చెరువు' కథలో అనూష వివరించిన తీరు చాలా బాగుంది. ఇంకా 'చెలిమి', 'మంచి మిత్రుడు', 'దానం విలువ' వంటి ఎన్నో కథలు మంచి సందేశంతో కూడుకొని ఉన్నాయి. ఈ పుస్తకంలోని ప్రతి కథ దేనికదే గొప్పది అని చెప్పవచ్చు. ఇలాంటి కథలు మరెన్నో చిన్నారుల కలం నుంచి జాలువారాలని కోరుకుంటూ వారికి అభినందనలు. 'సిద్దిపేట బడిపిల్లల కథలు' పుస్తకానికి చిత్రకారుడు కూరెళ్ల వేసిన కవర్ పేజీ ఆకర్షణీయంగా ఉన్నది.



యాడవరం
చంద్రకాంత్ గౌడ్
94417 62105

---

**ఆహ్వానం**

## రావణవీణ పురస్కారం

**ఇంటర్నేషనల్** హిందూ రావణ సేనా వాహిని ఆధ్వర్యంలో వరంగల్ వేదికగా ఈ నెల 27న 'రావణవీణ–2023' పురస్కారాల ప్రదానోత్సవం జరుగుతుంది. ప్రముఖ వాగ్గేయకారులు నలిగంటి శరత్ చమార్, మచ్చ దేవేందర్ ఈ పురస్కారానికి ఎంపికైనట్టు ఆ సంస్థ కో–ఆర్డినేటర్ డాక్టర్ ఆరూరి సుధాకర్ తెలిపారు. పద్మశ్రీ పురస్కార గ్రహీత గడ్డం సమ్మయ్య చేతుల మీదుగా పురస్కారాలు అందజేయనున్నారు. పురస్కారాలతో పాటు రూ.25 వేల నగదు బహుమానం కూడా అందివ్వనున్నారు.

---

# కత్తి పట్టిన చేతంబు...

**కత్తులు సాధారణ జీవితం నుంచి యుద్ధరంగం వరకు ఎన్ని రకాలుగా ఏ విధంగా ఉన్నాయి వాటి పేర్లు లక్షణాలు ఎలా ఉంటాయో వివరించే ప్రాచీన శాస్త్రీయ గ్రంథం 'ఖడ్గ లక్షణ శిరోమణి'. కత్తుల గురించిన వివరణలు గల తెలుగు పద్య కావ్యం ఇదొక్కటే లభ్యమైంది. ఇది కూడా భారతీయ భాషల్లోని ప్రాచీన శాస్త్రీయ గ్రంథాలను వెలికితీసి అచ్చు వేయించాలన్న ఆశయంతో మదరాసు రాష్ట్ర ప్రభుత్వం 1950లో దీనిని ప్రచురించింది.**

గ్రంథ రచయిత కవి నవనప్ప. ఇతడు నల్ల పిచ్చయ్య కుమారుడు. నవనప్ప తన తండ్రి నల్ల పిచ్చయ్య రాయరఘునాథ రాజుచే సమ్మానితుడనియు, తాను వారి తనయుడు విజయ రఘునాథరాజు నాజ్ఞనీయగా ఈ కృతి రచించితినని చెప్పుకొన్నాడు. రాయరఘునాథరాజు క్రీ.శ.1769–89 వరకు పుదుక్కోటను పాలించిన తొండమాన్ రాజు. ఇతడు భాషాపోషకుడగు విద్వత్ప్రభువు. ఇతని కొడుకు విజయరఘునాథరాజు 1769–1807 మధ్య పరిపాలించాడు. ఈ కాలంలోనే కవి నవనప్ప ఈ గ్రంథాన్ని పుదుక్కోటలోనే రచించాడు.

ఈ గ్రంథంలో 77 పద్యాలున్నాయి. కొన్ని సాంకేతిక పదజాల విశేషంతో ఉన్నాయి. రచయిత ఇష్టదేవతా ప్రార్థన కాగానే ఆ కాలంలోని కత్తులు తయారు చేసే ఐదుగురు నిపుణులను పేర్కొన్నారు.

**తిరుమల చిదంబరుడు:** ఇతడు కత్తుల తయారీలో అమితమైన నైపుణ్యం గలవాడు. విశ్వకర్మను మించిన ప్రజ్ఞాశాలి.
**చిగిలి లక్ష్మారాముడు:** ఇతడు సకల ఖడ్గముల క్రమమునెరిగినవాడు.
**శెంకి సుమాలు:** పనివారలందరిలో పండితుడు.
**అషకుశాయి:** ఖడ్గపరీక్ష యందు నిపుణులు
**సుభాభక్తుడు:** పై లక్షణాలు గలవాడు, గొప్ప పనివాడు.

కత్తుల వివరణకు ముందు వచనంలో అసి అను పేరు గల ముప్పై రెండు రకాల ఆయుధాల పేర్లు తెలిపి అవి లక్ష్మీనారాయణ సంవాదం అనే కావ్యంలో ఎలా వివరించబడినాయో, అదేవిధంగా ఈ కావ్యంలో కత్తుల గురించి వివరిస్తానని వారు పేర్కొన్నారు (లక్ష్మీనారాయణ సంవాదం అనే కావ్యం ఇప్పుడు అలభ్యం).



**ఆ ద్వాత్రింశతి ఆయుధాలు**

'పూర్వంబున హరిహర బ్రహ్మాదులకు నిఖిల సురాసుర మానవ లోకంబులకై విశ్వకర్మచే లక్షణ శాస్త్ర విరాజితంబుగా నిర్మితంబులైన అసి, ముద్గర, ముసల, కోహణ, కణ, కంపిణి, శిల్లు, భల్లాతక, భిండివాల, కరవాల, కుంతల, కోదండ, కఠారి, తోమర, పరశు, త్రిశూల, వజ్రముష్టి, గద, అవుది, అంగల, అంతక, పంకిణి, చక్ర, సబళ, ఈటి, ఇనుపకోల, శలకట్టి, పట్టిశ, ప్రకూర్మ, నఖర, మయూర్ధండనారసంబు మొదలగు ఆయుధాలు పేర్కొని వాటిని తెలుగులో వివరించెదనని చెప్పారు. దాదాపు 140 రకాల కత్తుల గురించి విశ్లేషిస్తూ ఆ కాలంలో ఉన్న ఉర్దూ, అరబ్బీ, పారశీక భాషల పేర్లు అలాగే ఉంచి వివరించారు. ఫిరంగిని అతను ఒక రకమైన కత్తిగానే భావించాడు. సూరై, త్యాగ, ఖండామిస్త్రీ, అబ్బాసి మొదలగు ఉర్దూ పదములు, ఇతర భాషా పదములు ఉపయోగించాడు. మొదటి పద్యాలలో పేర్లను వివరించి, తర్వాతి భాగాల్లో వాటి లక్షణాలు వివరించారు.

పై పేర్లలో ఫిరంగి అనునది ఒక కత్తి, సైఫ్ అనునది నిలువు కత్తి (straight sword), గురుదా అనునది కత్తులు చేసే ఇనుమ ఖనిజం, సురై అనునది సిరియా భాషలో కత్తి, త్యాగ అనునది సాధారణమైన ఖడ్గం. ఇక లక్షణాలలో చూరి అంటే కొచ్చటి కొస గలది. (sharp pointed end). దోర్యాలు అనునది గీతల ముద్రలు గలది. జిహ్వార్ అంటే పదునైన వంకర కొసగలది. వాయుదార అంటే పదునైనది. ఈ కత్తుల గుణదోషాలు ప్రమాదాలు ప్రమాణాలు అన్నీ పద్యాలలో వివరించారు కవి. ఉదాహరణకు ఒక పద్యం చూడండి.

**గడుసును వాయుదాల్ కడవెళ్ల నొకరీతి**
**లా గనుపట్టు డోర్యాలు మూడు**
**ఈగకాళ్లకు సమం బింపైన దుగళము**
**లవకాయ లీతినుండు పంక**
**పొడుగైదు జానలు పొల్లక పెనుకయు**
**వెడలుపు మూడు వేళ్ళడరు నలుపు**
**చంద్రవంకలు జేర్చి సన్నబిందులు పైని**
**యుంచి ముందిరలుండు మించెనేని**

**తే.గీ.:కత్తి పట్టిన చేతంబు గతిని వెలయు**
**తావు నిరంపు త్యాగదై దనరు చూరి**
**వంపవచ్చును బిగువుతో వంపి జూడ**
**జాతి మకరంబు లీరీతి సరసనుండు**

మకరముల్ అనే జాతి ఖడ్గాల లక్షణాలు వివరించారు పై పద్యంలో కవి. పొడువు ఐదు జానలు, మూడు వేళ్ళ వెడల్పు, ఈగ కాళ్ళకు సమానమైన పదును మూడు గీతలు కలవి. ఖడ్గశాస్త్రం వేదకాలం నుంచే ప్రాచుర్యంలో ఉంది. అగ్ని పురాణం, బృహత్సంహిత, శుక్రనీతి, మహాభారతం, శివతత్త్వ రత్నాకరం లాంటి ప్రాచీన గ్రంథాలలో ఖడ్గ లక్షణాలు వివరాలు ఉన్నట్టు పెద్దలు పేర్కొన్నారు.

### ఖడ్గ లక్షణ శిరోమణిలో వివరించిన కత్తుల పేర్లలో కొన్ని

హస్తంబులు, మకరంబులు, జవబల్, మక్కై, వాజిలల్ కిరై మాని ఫిరంగు, తురా ఫిరంగు, యెక్కెల్ ఫిరంగు, గోర్యా ఫిరంగు, కుష్కీ ఫిరంగు, పూర్తి కాల్ సైఫ్, నుక్కాసైఫ్, మకరబ్ సైఫ్, రుకమ్మి సైఫ్, యిసుపాత్ సైఫ్, మళయవారి సైఫ్, వులాంధ సైఫ్, జజ్ఞాసైఫ్, పుతన్ క సైఫ్, కుష్కీ సైఫ్, యిసుపాత చాంద్ బందర్, గోవా బందర్, మహమద్ బందర్, బెల్ బందర్, నాట్ బందర్, ఆరా బందర్, ఫ్రాన్స్ బందర్, జ్ఞా బందర్, పూతన్ కేసీ బందర్, యెనా బందర్, మహ్మద్ బందర్, బందర లయిమాని, మోనాభి బందర్, తినాబి బందర్, వురేబం, పాంబందర్, డ్యాలు బందర్, బత్తాలి బందర్, మారాషాసురై, కాయన్ తే బందర్, ఇంగ్లిష్ బందర్, యిందుస్తానీ సురై, భుజకా సురై, రాజాషాసురై, కంచకా సురై, పప్పషాసురై, అంబబాగీసు రైఔ, వాసికుని సురై, సాదా లాగుబ్రాల్ సురై, సుదా దౌలా సురై, కల్కత్తాసురై, కత్తాసుకా సురై, సిద్ధోట్కుకా సురై, సురతా నిశాయి సురై, కతియ కెరాట్ సురై, బందవాన్ త్యాగ, వ్యహం తాగ, అంబరీ త్యాగ, రుమీ త్యాగ, గుజరాత్ త్యాగ, బద్యాశిత్యాగ, హిరాకిత్యాగ, వర కుసిల్ త్యాగ, అబ్దాల త్యాగ, జహాశా త్యాగ, ముత్తాన్ త్యాగ, బగ్దాత్యాగ, బహోరి త్యాగ, లహూరి త్యాగ, అకుపరి త్యాగ, అపరంగజ్యాపి త్యాగ, మౌవల త్యాగ, నిరవరి త్యాగ, బువాన్ త్యాగ, అషజ్ఞా త్యాగ, జికర త్యాగ, దేప గది చాండ్యా త్యాగ, బంగాళి త్యాగ...



చేపూరి శ్రీరాం
అష్టావధాని, హన్మకొండ